క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



బ్రహ్మోత్సవాల అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళ భక్తులు

డోన్ : పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, రాముశర్మలు తెలిపారు. ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజినీబాయి, శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ పూజలకు హాజరయ్యే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. శుక్రవారం ఆలయంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా భక్తులకు గరుడప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు.

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు శ్రీనివాసులు



ఉపాధ్యక్షుడు తిరుపాలు

కోవెలకుంట్ల: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయవాదుల బార్ కౌన్సిల్ ఉత్తర్వుల మేరకు ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా డి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా వి తిరుపాలు, ప్రధాన కార్యదర్శిగా ఎం ఓబులేసు, ఉప కార్యదర్శిగా డి శేఖర్, కోశాధికారిగా సి నాగశేషును ఎన్నుకున్నారు. నూతన కమిటీని సీనియర్ న్యాయవాదులు వాసగిరి సాయి కృష్ణమూర్తి, ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, బాల మురళీకృష్ణ, తిరుపతయ్య, మధుసూదన్‌రెడ్డి, నరసింహ, ప్రేమ్‌నాథ్‌బాబు, కాశీంసాహెబ్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి పల్లకీ సేవ శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉచిత భోజన పథకానికి పూర్వ విద్యార్థులు విరాళం

డోన్ టౌన్ : స్థానిక జీవీఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మధ్యాహ్నం అందిస్తున్న ఉచిత భోజన పథకానికి ఎస్కేపీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు(1984-85) విరాళం ప్రకటించారు. విద్యార్థులకు వారం రోజులు భోజనం వడ్డించేందుకు అయ్యే ఖర్చు పూర్వ విద్యార్థులు అందజేశారని స్వామి వివేకానంద సేవా సమితి కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు.

రేపు ఉచిత కంటివైద్య శిబిరం

డోన్ : స్థానిక కొత్తబస్టాండ్ ఎదుట ఉన్న వైద్య పాలిక్లినిక్ వద్ద ఈనెల 31న ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్ఫూర్తి సేవాసమితి సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలుకు చెందిన సుశీల నేత్రాలయ, డోన్ వైద్య పాలిక్లినిక్‌ల సహకారంతో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో కంటి వైద్యపరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

సంతాపం

డోన్ టౌన్: పట్టణంలోని బుడగజంగాల కాలనీకి చెందిన సంఘం నాయకుడు ఇప్పె పెద్ద నరసప్ప (95) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. 24వ వార్డు కౌన్సిలర్ బోయ సుమలత, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ సురేశ్ తదితరులు సంతాపం తెలిపారు. పెద్ద నరసప్ప మృతదేహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా అల్లా బకాష్ మియ్యా ఉరుసు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గంలో వెలసిన అల్లా బకాష్ మియ్యా ఉరుసు శుక్రవారం ఘనంగా జరిగింది. భక్తులు అల్లాబకాష్ మియ్యాకు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. భక్తులకు అన్నదానం చేశారు.



రూ.3కోట్లతో నిర్మించిన డోన్ అతిథిగృహం



రూ.కోటితో నిర్మించిన డోన్ జెడ్పీ వసతి గృహం



రూ.2కోట్లతో ప్యాపిలిలో నిర్మించిన ఆర్‌అండ్‌బీ వసతి గృహం

అతిథి గృహాలు కళకళ!

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాలు మెరుస్తున్నాయి. ఏళ్లతరబడి కనీసం మరమ్మతులకు నోచుకోని ప్రభుత్వ కార్యాలయాలు, పీహెచ్‌సీల పునర్నిర్మాణం చేపట్టింది ప్రభుత్వం. ఈ నేపథ్యంలో శిథిలావస్థ చేరి అక్కరకురావనుకున్న ప్రభుత్వ అతిథి గృహాల పునర్నిర్మాణానికి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. దీంతో నేడు ఆ అతిథి గృహాలు ఉపయోగంలోకి వచ్చాయి. మంత్రి బుగ్గన ప్రత్యే చొరవతో అతిథి గృహాలు కళకళలాడుతున్నాయి. డోన్ పట్టణ నడిబొడ్డున ఉన్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను రూ.3కోట్లతో, డోన్ కొత్తబస్టాండ్ సమీపానున్న జెడ్పీ గెస్ట్‌హౌస్‌ను రూ.కోటితో, ప్యాపిలి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను రూ.2కోట్లతో సర్వాంగ సుందరంగా నిర్మించారు. అన్ని హంగులతో సకల వసతులు కల్పిస్తూ భవనాలు నిర్మించడంతో అధికారులు తరచుగా జరుపుకునే సమావేశాలు, సమీక్షలకు ఉపయోగపడుతున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ అతిథి గృహాలు కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు దోహద పడుతున్నాయి. నేడు అతిథులకు అవసరమైన ఆతిథ్యమిచ్చే చుట్టాల్లా చక్కగా ఉపయోగపడుతున్న అతిథి గృహాలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గడ్డివామి దగ్ధం



డోన్ రూరల్ : మండల పరిధిలోని యు.కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు కె.రామాంజినేయులు గడ్డివామి శుక్రవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సొంత దొడ్డిలో పశువుల కోసం వేసుకున్న గడ్డివామి కాలి పోవడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చిన సిబ్బంది మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. రైతు దాదాపు రూ.50వేల వరకు నష్టం వాటిల్లినట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

బేతంచెర్ల: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు వర్తింపజేశారని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 10, 11 వార్డులో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కౌన్సిలర్ ఇబ్రహీమ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మంత్రి బుగ్గన సారథ్యంలో డోన్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని విశదీకరించారు. విద్య, వైద్యం, గ్రామీణ రహదారుల అభివృద్ధికి మంత్రి బుగ్గన ఇచ్చిన ప్రాధాన్యతను తెలిపారు. గత ముప్పైఏళ్లలో జరగని అభివృద్ధిని కేవలం ఐదేళ్లలో మంత్రి బుగ్గన చేసి చూపారని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఖాజా, నాయకులు గూని నాగరాజు, శేఖరయ్య, యశ్వంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గుండా జగన్, సుబ్బారెడ్డి, జనార్ధన్, బొల్లి మద్దిలేటి, సంధానీ బాషా, వలీ బాషా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న వెంటే చల్లా కుటుంబం

- వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం
- చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: సీఎం వైఎస్ జగనన్న వెంటే చల్లా కుటుంబ ఉంటుందని, వైఎస్సార్‌సీపీ గెలుపునకు అంకితభావంతో కృషి చేస్తామని ఆ పార్టీ ముఖ్య నేత చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రం అవుకులోని చల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొన్ని రోజులుగా చల్లా కుటుంబం పార్టీ మారుతుందని వస్తున్న వదంతులను చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి ఖండించారు. తమ బాబాయి చల్లా భాస్కర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని వీడడంలో ఆయన బావమర్ది ప్రమేయం ఉందని, ఎప్పటికీ చల్లా కుటుంబం ఐకమత్యంగానే ఉంటుందన్నారు. ఇక్కడి పరిస్థితులను గురువారం నంద్యాలలో జరిగిన మేమంతా సిద్ధం బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించామన్నారు. దివంగత నేత చల్లా రామక్రిష్ణా రెడ్డి, దివంగత చల్లా భగీరథ్ రెడ్డి ఉన్న సమయంలోనూ, వారి మరణానంతరం కూడా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మా కుటుంబానికి అండగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన సాయం ఎప్పటికీ మరువమని, జగనన్న వెంటే నడుస్తానన్నారు. అవసరమైతే రాజకీయాలనైనా వదిలేస్తానేమోగాని, వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తేలేదని కరాఖండిగా తేల్చిచెప్పారు. మరోవారం రోజుల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ముమ్మరంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనడమేకాకుండా ఓటు బ్యాంక్ పెంచడానికి కృషి చేస్తానని తెలిపారు. చల్లా వారసుడిగా, వైఎస్సార్‌సీపీ నాయకుడిగా అందరికీ అందుబాటులో ఉంటానని, ప్రజలు వదంతులు ఏ మాత్రం నమ్మొద్దని ఈ సందర్భంగా చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి మరోమారు స్పష్టం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో భూ సంరక్షణ



కషాయల తయారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

బనగానపల్లె రూరల్ : ప్రకృతి వ్యవసాయంతో భూ సంరక్షణతో పాటు దిగుబడులు బాగుంటాయని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మీ తెలిపారు. మండలంలోని యాగంటిపల్లె సమీపంలోని కేవీకేలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ధనలక్ష్మీ మాట్లాడుతూ రసాయన మందులతో గాలి, నీరు కలుషితమవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో నేల ఆరోగ్యంతోపాటు మనం కూడా ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు. కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బాలరాజు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వివిధ ఉత్పాదకాల తయారీ విధానాలను వివరించారు. మరో శాస్త్రవెత్త రమణయ్య నేల ఆరోగ్యాన్ని పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఎరువుల వాడకం, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వినియోగాన్ని వివరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హనుమంతరాయ సొసైటీ పరిపాలన అధికారి సురేష్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు రవిగౌడ్, లక్ష్మీపియ, ఎపీసీఎస్‌ఎఫ్ డిప్యూటీ డీపీఎం సలాం, నంద్యాల, కోవెలకుంట్ల డివిజన్ల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కరుణామయుడు.. ఏసుక్రీస్తు

- ఘనంగా గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు



సంజామల : నొస్సంలో దైవ సందేశం ఇస్తున్న రెవరెండ్ విక్టర్ విజయ్ కుమార్



బేతంచెర్లలో సిలువను మోస్తున్న దృశ్యం



కోవెలకుంట్ల: ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ మోస్తున్న క్రైస్తవులు



అమడాలలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



అవుకు : శిలువ యాత్ర పాల్గొన్న క్రైస్తవులు



బనగానపల్లె : నందివర్గం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కోవెలకుంట్ల: సకల మానవుల పాప పరిహారార్థ బలిగా ఏసుక్రీస్తు ప్రాణమిచ్చిన ప్రభువు ఏసుక్రీస్తు కరుణామయుడు అని ఆయా చర్చిల ఫాదర్లు లూర్దు, ప్రేమ్‌సాగర్, ప్రకాష్ తెలిపారు. శుక్రవారం బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కోవెలకుంట్ల- నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలోని ఆర్‌సీఎం, సీఎస్‌ఐ, హోసన్నా, నూతన యేరులేం, హెబ్రు తదితర చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా చర్చిల పెద్దలు విజయ్, జయరాజు, మైకేల్, రవి, ఓబులేసు, సుబ్బరాయుడు, రఘు, నవీన్, బుచ్చన్న, కరుణాకర్, సతీష్ సైమన్, బాలస్వామి,దేవ భూషణం, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండల కేంద్రం సంజామలతోపాటు గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నొస్సం సీఎస్‌ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ విక్టర్ విజయకుమార్ గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సంఘం టీచర్ దేవరాజు, రెవరెండ్ దేవప్రకాష్, బ్రదర్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: క్రీస్తు అనగానే క్షమ,క రుణ గుణాలు గుర్తుకొస్తాయి. పాపులను పరిశుద్ధులను చేసేందుకు కరుణామయుడైన ఏసుక్రీస్తు శిలువపై తన ప్రాణాలు వదిలిన రోజే గుడ్‌ఫ్రైడే. శుభ శుక్రవారం సందర్భంగా క్రీస్తు త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ మండల కేంద్రం కొలిమిగుండ్లతోపాటు గ్రామాల్లోని చర్చీలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అవుకు: మండల కేంద్రం అవుకుతో పాటు గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఆయా చర్చీల్లో క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. అవుకు పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకుముందు పట్టణ పుర వీధుల గుండా సిలువ యాత్ర నిర్వహించారు. గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను ఫాదర్ కరుణాకర్ వివరించారు.

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్లతోపాటు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానికసెంట్ ఆన్స్ స్కూల్ సమీపాన ప్రత్యేక ప్రార్థనల అనంతరం శిలువను మోసుకుంటూ 14 స్థలాల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి వరకు ఊరేగింపు సాగింది. క్రైస్తవులు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా బేతంచెర్ల ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ కిరణ్ కుమార్ సూచించారు. సిమెంటునగర్‌లో సీఎస్‌ఐ చర్చి పాస్టర్ వినోద్ కుమార్, చర్చి నిర్వాహకులు డేవిడ్ రాజు, సుధాకర్, స్వాములు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనల నిర్వహించారు.

బనగానపల్లె రూరల్ : మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవ మందిరాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు ఉపవాసదీక్ష ప్రార్థనలు జరిగాయి. బనగానపల్లె పట్టణంలోని సీఎస్‌ఐ టౌన్ చర్చి రెవరెండ్ ఆల్బర్ట్, మదర్ థెరిస్సా చర్చి ఫాదర్ బాబురాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించి గుడ్‌ఫ్రైడే ప్రముఖ్యత వివరించారు.

ఉమేష్ చంద్ర ఆదర్శప్రాయుడు



ఉమేష్ చంద్ర చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

డోన్ టౌన్ : ప్రతి పోలీసుకు, అధికారులకు చదవలవాడ ఐపీఎస్ అధికారి దివంగత ఉమేష్ చంద్ర ఆదర్శప్రాయుడని అగ్నిమాపక కేంద్రం అధికారి రంగస్వామి, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ పేర్కొన్నారు. ఉమేష్ చంద్ర జయంతి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు ఉమేష్ చంద్ర సేవలను గుర్తు చేశారు. ఆయన నిక్కచ్చిత విధానాల మూలగా గుండాల తూటాలకు బలయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ రంగస్వామి, ఎల్‌ఎఫ్‌లు రంగస్వామి, షహెన్‌షా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంతా ఉత్తిదే!

- కొంతమేర తగ్గిన ధర్మవరం సుబ్బారెడ్డి
- అయోమయంలో అనుచర వర్గీయులు
- నేటి ఆత్మీయ సమావేశానికి కోట్ల వర్గాన్ని ఆహ్వానించిన వైనం
- కేఈ వర్గం దూరం... దూరం




మీసం మెలేస్తున్న సుబ్బారెడ్డి (ఫైల్)

డోన్ : టీడీపీ డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మూడేళ్ళు గొడ్డుచాకిరి చేసిన ధర్మవరం సుబ్బారెడ్డికి ఏదీ కలిసి రావడం లేదు. సాక్షాత్తూ చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌బాబు డోన్ టీడీపీ అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డే అని తేల్చేయడమే కాదు ఆరడుగుల బుల్లెట్ అంటూ ఆకాశానికెత్తారు. ఆర్థిక మంత్రి బుగ్గనకు దీటైన వ్యక్తి అని తెగపొగడడమే కాదు... నీకు అడ్డులేదంటూ భరోసా ఇచ్చారు కూడా. బాబు మాయమాటలు నమ్మిన సుబ్బారెడ్డి మూడేళ్లుగా స్థాయికి మించి విమర్శలు చేయడమే కాకుండా నీళ్లలా డబ్బును కూడా ఖర్చు చేశాడు. మంత్రి బుగ్గన చేసిన అభివృద్ధిపై నివేదికలు తెప్పించుకున్న బాబు తన నిజస్వరూపాన్ని బయటపెట్టారు. బుగ్గనకు సుబ్బారెడ్డి సరైన వ్యక్తి కాదని నిర్ణయించుకున్న బాబు ఏకంగా మాజీ కేంద్ర సహాయ మంత్రి కోట్లను తెరపైకి తెచ్చారు. ఈ నేపథ్యంలో అసహనానికి గురైన సుబ్బారెడ్డి కోట్ల, కేఈ వర్గాలపై ధ్వజమెత్తారు. ఆ రెండు వర్గాలు ఉద్దేశపూర్వకంగానే తనకు అన్యాయం చేశాయని నిరసన గళం విప్పారు. నేను కష్టపడితే ఫలితం మీకా.. అంటూ తాను నిర్వహించిన బల ప్రదర్శన బహిరంగ సభలో విమర్శలు గుప్పించారు. నేనంటే ఏంటో చూపుతా అంటూ తొడకొట్టి మీసం మెలేశాడు ధర్మవరం సుబ్బారెడ్డి. ఎట్టకేలకు జరిగిన మంతనాలు ఫలించాయి. బుజ్జగించడంతో తనను మించినోళ్లు లేరని నిరూపించుకుంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పదవిని ధర్మవరం సుబ్బారెడ్డికి కట్టబెట్టి శాంతిపర్చాడు చంద్రబాబు. ఇంత వరకు బాగున్నా.. నేనూ తక్కువేం కాదన్నట్లుగా ధర్మవరం సుబ్బారెడ్డి సైతం నేడు కోట్ల కుటుంబ సభ్యులు, వర్గీయులతో మాత్రమే ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేఈ కుటుంబీకులను ఆత్మీయ సమావేశానికి పిలవకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం. బాబుకు తగ్గ తమ్ముడిలా ధర్మవరం సుబ్బారెడ్డి తన శైలిని చాటుకున్నాడు. అబ్బే తొడకొట్టడడం... మీసం తిప్పడం అంతా ఉత్తిదే... నేను ఎప్పటికీ కోట్ల వర్గీయుడినే... అని నిరూపించుకున్నాడు ధర్మవరం సుబ్బారెడ్డి.

ప్రజల్లేని... ప్రజాగళం!

- బాబు సభకు జనం కరువు
- అంతా నేనే చేశానంటూ ప్రగల్భాలు
- ప్రసంగం ప్రారంభమైన వెంటనే వెనుదిరిగిన జనం



కొలిమిగుండ్ల బస్టాండ్‌లో మూడు బస్సులు ఏర్పాటు చేసినా కనిపించని జనం



బనగానపల్లె బాబు రోడ్‌షోలో మధ్యలోనే వెనుతిరిగిన ప్రజలు



బనగానపల్లె ఆర్టీసి బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బనగానపల్లె : బనగానపల్లె పెట్రోల్‌బంకు కూడలిలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన చంద్రబాబు ప్రజాగళం పూర్తిగా విఫలమైంది. ప్రజా గళానికి జనం కరువయ్యారు. మండుటెండలో ప్రజలను నిలబెట్టి సోది చెప్పారు చంద్రబాబు. హైదరాబాద్ నేనే అభివృద్ధి చేశా... సెల్ ఫోన్ టెక్నాలజీ నేనే తెచ్చా...సాగునీటి ప్రాజెక్టులను నేనే నిర్మించా.... డ్వాక్రా సంఘాలను నేనే తెచ్చా... అంటూ బాబు రొటీన్ డైలాగులతో సభకు వచ్చిన అరకొర ప్రజలు సైతం నిరాశకు గురయ్యారు. ఎంత మంది నైన పిల్లలను కనండి.. ఎంత మందిని కంటే అంతమంది ఏడాది రూ.15 వేలు ఇస్తాంటూ బాబు మరోమారు మాయమాటలతో మభ్యపేట్టే ప్రయత్నం చేశారు. బాబు పక్కన ఉన్న బీసీతోపాటు నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరి అయోమయానికి గురైనట్లు కనిపించారు.

ఇబ్బందులు పడిన ప్రయాణికులు

పెట్రోల్ బంక్ కూడిలలో సభ నిర్వహించడంతో ప్రజలతోపాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కర్నూలు, నంద్యాల, తాడిపత్రి రోడ్ల కూడలి కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇక ప్రయాణికులు బస్టాండ్‌లో నిరీక్షణ తప్పలేదు.

ప్రజాగళం సభకు ఆర్టీసీ బస్సులు

కొలిమిగుండ్ల: బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్ బంక్ కూడలిలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన ప్రజాగళం సభకు కొలిమిగుండ్ల మండలం నుంచి ఆర్టీసీ బస్సుల్లో తెలుగు తమ్ముళ్లను తరలించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సిద్ధం సభలకు బస్సులు ఉపయోగించుకుంటే టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా లేని పోని రాద్ధాంతం చేశాయి. అధికార పార్టీ బస్సులు వాడుకుంటే బస్టాండ్ల వద్ద ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందని ఎల్లో మీడియా విషం కక్కింది. ఎదుటి వారికి నీతులు చెప్పిన టీడీపీ నాయకులు బాబు ప్రజాగళం కార్యక్రమానికి ఆర్టీసీ బస్సులు ఉపయోగించడంపై సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి. చంద్రబాబు సభకు జన సమీకరణ చేసేందుకు తమ్ముళ్లకు ముచ్చెమటలు పట్టాయి. ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినా జనం కరువయ్యారు. చివరకు డబ్బులు,మద్యం బాటిళ్ల ఇచ్చి అష్టకష్టాలుపడి అరకొరగా వచ్చినవారని బస్సుల్లో తీసుకెళ్లారు తెలుగుతమ్ముళ్లు.